క్లుప్తంగా

సీఎం సభ విజయవంతం



పొన్నాడ వెంకట సతీష్‌కుమార్

ముమ్మిడివరం: అమలాపురంలో సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి సభ విజయవంతమైందని ఎమ్మెల్యే, జిల్లా పార్టీ అధ్యక్షుడు పొన్నాడ వెంకట సతీష్‌కుమార్‌ శనివారం తెలిపారు. సభకు నియోజకవర్గం నుంచి 30 వేల మంది హాజరయ్యారని, సభకు తరలివచ్చిన డ్వాక్రా మహిళలందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. డ్వాక్రా మహిళలకు రుణమాఫీ, సున్నా వడ్డీ రాయితీ వంటి పథకాలు అమలు చేస్తున్న జగన్‌ ప్రభుత్వానికి మహిళలు అండగా నిలుస్తున్నారని చెప్పారు.

ఘనంగా రుద్ర హోమం



వీరేశ్వరస్వామి ఆలయంలో రుద్ర హోమం చేస్తున్న పండితులు

ఐ.పోలవరం: నిత్యకల్యాణం పచ్చతోరణంగా విరాజిల్లుతున్న మురమళ్ల వీరేశ్వరస్వామి ఆలయంలో పరమశివుని జన్మనక్షత్రమైన ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకుని రుద్రహోమం శనివారం ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకస్వామి పేటేటి శ్యామల కుమార్‌ ఆధ్వర్యంలో నాగాభట్ల రామకృష్ణమూర్తి, నాగాభట్ల రవిప్రసాద్‌లు స్వామికి గణపతి పూజ, మండపారాధన, రుద్రహోమం, పూర్ణాహుతి తదితర పూజలు జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి దర్శించుకుని అనంతరం తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

రూ.25కే జాతీయ జెండా

అమలాపురం టౌన్‌: తపాలా కార్యాలయాల్లో కేవలం రూ.25 నామమాత్రపు ధరకే జాతీయ జెండాను పొందొచ్చని అమలాపురం పోస్టల్‌ డివిజన్‌ ప్రధాన కార్యాలయ సూపరింటెండెంట్‌ సలాది శ్రీధర్‌ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. దేశవ్యాప్తంగా ఏ తపాలా కార్యాలయంలోనైనా ఈ జాతీయ జెండాలు విక్రయాల కోసం అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. మంగళవారం జరిగే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో జాతీయతా స్ఫూర్తిని ప్రతిబింబించేలా అమలాపురం పోస్టల్‌ డివిజన్‌ పరిధిలోని వినియోగదారులంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

స్వాతంత్ర్య వేడుకలకు ముఖ్య అతిథిగా మంత్రి లక్ష్మీనారాయణ

యానాం: యానాంలో ఈ నెల 15న జరిగే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు పుదుచ్చేరి పీడబ్ల్యూడీ శాఖ మంత్రి లక్ష్మీనారాయణ హాజరుకానున్నారు. స్థానిక బాలయోగి స్టేడియంలో జరిగే వేడుకల్లో పుదుచ్చేరి ప్రభుత్వం తరపున ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని జాతీయజెండాను ఆవిష్కరించి ప్రభుత్వ సందేశాన్ని ఇవ్వనున్నారు. ఏటా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు నాలుగు రీజియన్‌లకు నలుగురు మంత్రులను ముఖ్య అతిథులుగా పంపించడం ఆనవాయితీగా వస్తుంది. కార్యక్రమంలో ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్‌ అశోక్‌, ఆర్‌ఏఓ మునిస్వామి తదితరులు హాజరుకానున్నారు.

ఈ-పంట నమోదు తప్పనిసరి

ముమ్మిడివరం: గ్రామాల్లో తొలకరి పంట సాగు చేస్తున్న రైతులంతా తప్పనిసరిగా పంటల నమోదు చేయించుకోవాలని వ్యవసాయాధికారి ఎస్‌.ప్రశాంతకుమార్‌ సూచించారు. ఆయన శనివారం మండలంలో పలు గ్రామాల్లో పర్యటించి తొలకరి సాగుపై రైతులకు సూచనలు చేశారు. మండలంలో సుమారు 7 వేల ఎకరాల్లో ఖరీఫ్‌ సాగు చేస్తున్నారని వీరంతా తప్పనిసరిగా ఆర్‌బీకే సిబ్బందిని సంప్రదించి ఈ-క్రాప్‌ బుకింగ్‌ చేయించుకోవాలన్నారు. ఈకేవైసీ లేని పక్షంలో ప్రభుత్వ పథకాల అమలులో ఇబ్బందులు ఎదురవుతాయని హెచ్చరించారు.

పర్యావరణానికి మొక్కలు దోహదం



తాళ్లరేవు పాఠశాలలో మొక్కలు నాటుతున్న లయన్స్‌క్లబ్‌ ప్రతినిధులు

తాళ్లరేవు: పర్యావరణ పరిరక్షణకు మొక్కలు ఎంతగానో దోహదపడతాయని, ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలని లయన్స్‌ క్లబ్‌ ప్రతినిధులు పెద్దిరెడ్డి ఉమామహేశ్వరరావు, బిళ్లకుర్తి శ్రీనివాసరెడ్డిలు తెలిపారు. శనివారం అంతర్జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా స్థానిక నూసన్‌ పబ్లిక్‌ స్కూల్‌లో యువతీ యువకులతో కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో యానాం, తాళ్లరేవు లయన్స్‌క్లబ్‌ అధ్యక్షులు సహదేవరాజు, బోడె శ్రీనివాస్‌, క్లబ్‌ ప్రతినిధులు జి.సూర్యనారాయణరాజు, కట్టా ఆదినారాయణ, రాయపరాజు పాల్గొన్నారు.

సచివాలయాలు.. సేవా నిలయాలు..

- సాకారమవుతున్న గ్రామ స్వరాజ్యం
- ఇంటి వద్దకే సకల సేవలు

ఉప్పలగుప్తం: ప్రజల వద్దకే పాలనని గొప్పలు చెప్పుకున్న టీడీపీ ప్రభుత్వంలో సంక్షేమ పథకాల కోసం నాయకుల చుట్టూ చెప్పులరిగేలా తిప్పుకునేవారు. వారిని సంతృప్తి పరిస్తే గాని పథకాలు వర్తింపజేసేవారు కాదు. పైగా సదరు పచ్చనేతల్ని ప్రసన్నం చేసుకున్నాక పని పూర్తి చేసుకోవడానికి మండల కేంద్రాల చుట్టూ తిరగడానికి తీవ్ర అవస్థలకు గురవ్వాల్సి వచ్చేది. వైఎస్సార్‌ సీపీ అధికారంలోకి రాగానే ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ సచివాలయ వ్యవస్థను ప్రవేశపెట్టి గాంధీజీ కలల కన్న గ్రామ స్వరాజ్యానికి శ్రీకారం చుట్టారు. ఇది సత్ఫలితాలనివ్వడంతో ప్రజల నుంచి హర్షం వ్యక్తమవుతుంది.

ప్రతి 2 వేల జనాభాకు సచివాలయం

పరిపాలనా వికేంద్రీకరణలో భాగంగా మండల కేంద్ర కార్యాలయంలో నిర్వహిస్తున్న ప్రజాపాలనను గ్రామ స్థాయిలోకి మార్చేందుకు ప్రతి 2 వేల జనాభాకు ఒక సచివాలయాన్ని ఏర్పాటుచేశారు. దీంట్లో భాగంగా 540 పౌర సేవలను స్థానిక సచివాలయాల్లోనే అందిస్తున్నారు. సచివాలయ వ్యవస్థకు అనుసంధానంగా వలంటీర్‌ వ్యవస్థను ఏర్పాటు చేసి ప్రతి 50 మందికి ఒక వలంటీర్‌ను నియమించారు. సచివాలయ వ్యవస్థ ఏర్పాటుతో ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను నేరుగా లబ్ధిదారులకే చేరుస్తున్నారు.



చినగాడవిల్లిలో సచివాలయ భవనం

ఇంటి ముంగిటకే పథకాలు

క్షేత్రస్థాయిలో వలంటీర్లు సంక్షేమ పథకాలకు అర్హులను గుర్తించి నేరుగా లబ్ధిదారుని ఇంటికి వెళ్లి వివరాలు తీసుకుని కుల, మత, రాజకీయాలేవి చూడకుండా పారదర్శకంగా పథకాలను వర్తింపజేస్తున్నారు. ప్రతి నెలా ఒకటో తేదీన సూర్యోదయం కాక ముందే పింఛన్లను అందజేస్తున్నారు. రైతు భరోసా, పింఛన్‌ కానుక, వైఎస్సార్‌ ఆసరా, చేదోడు, నేతన్న నేస్తం, అమ్మ ఒడి, కాపు నేస్తం, పంటల బీమా, వసతి దీవెన, విద్యా దీవెన తదితర పథకాలను సచివాలయాల్లోనే అందిస్తున్నారు. ఇవి కాక పౌర సేవలు, జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు, పీఎం కిసాన్‌, పేదలందరికీ ఇళ్లు, రేషన్‌ కార్డులో మార్పులు తదితర సేవలను అందిస్తున్నారు. అర్హత ఉంటే చాలు సంక్షేమ పథకాలు ఇంటి తలుపు తట్టి పథకాలు అందిస్తున్నారు. దీంతో పాటు సమస్యలను పరిష్కరించుకోవడానికి సచివాలయంలో గ్రామ స్థాయి స్పందన, పూర్తి స్థాయి లబ్ధి కోసం జగనన్న సురక్ష, 1902 జగనన్నకు చెబుదాం వంటి కార్యకలాపాలు సైతం గ్రామ సచివాలయాల్లోనే జరుగుతున్నాయి.

ఉప్పలగుప్తం మండలంలో 17 సచివాలయాల్లో సంక్షేమ పథకాల లబ్ధి వివరాలు

పథకం పేరు	లబ్ధిదారులు	మొత్తం (రూ.కోట్లలో)
రైతు భరోసా	14,602	19.71
ఆసరా	14,262	27.96
కాపు నేస్తం	4,217	6.32
విద్యా దీవెన	5,250	18.32
వసతి దీవెన	3,869	3.87
పింఛన్‌ కానుక	23,100	64.80
చేయూత	8,495	15.93
పంటల బీమా	884	0.84
ఇన్‌పుట్‌ సబ్సిడీ	2,443	1.87
అమ్మ ఒడి	15,338	64.41
నేతన్న నేస్తం	613	1.47

ప్రజలకు ఇబ్బంది తగ్గింది



గతంలో ప్రజలు ఏ పని ఉన్నా, ఏ సమస్య వచ్చినా మండల కేంద్రానికి వచ్చి వేచి చూసేవారు. ప్రస్తుతం గ్రామ సచివాలయాలు ఏర్పాటయ్యాక గ్రామంలోనే సమస్యలు పరిష్కారమవుతున్నాయి. సచివాలయ సిబ్బందికి ఏదైనా సందేహం వస్తే మండల కేంద్రం నుంచి పరిష్కరిస్తున్నాం. సచివాలయాల రాక తరువాత ప్రజలకు మండల కేంద్రాలకు వచ్చి వేచి ఉండే ఇబ్బంది తగ్గింది.

– కేఎస్‌ గౌరీకుమారి, ఎంపీడీఓ, ఉప్పలగుప్తం మండలం

సచివాలయాల ద్వారానే సేవలు



మా కుటుంబానికి జగనన్న కాలనీలో ఇళ్ల స్థలం ఇచ్చారు. గృహ నిర్మాణానికి రూ.1,80,000 లోను వచ్చింది. డ్వాక్రా రుణ మాఫీ విడతకు రూ.4,400 జమ చేస్తున్నారు. మాకు ఏటా నేతన్న నేస్తం కింద రూ.24,000 అందుతుంది. ఇవన్నీ మా గ్రామంలో ఉన్న సచివాలయంలో దరఖాస్తులు చేస్తే చాలు ఇచ్చేస్తున్నారు. ఎక్కడికో వెళ్లాల్సిన పని లేదు.

– పుత్సల లక్ష్మీకోటేశ్వరి, విలసవిల్లి, ఉప్పలగుప్తం మండలం

ఇంటి ముంగిటకే పథకాలు



గతంలో టీడీపీ నాయకుల అనుమతి లేకపోతే పథకాలు అందేవి కాదు. వైఎస్సార్‌ సీపీ అధికారంలోకి వచ్చాక అలాంటి ఇబ్బందులకు తావు లేకుండా గ్రామాల్లో సచివాలయాలు ప్రవేశపెట్టి వలంటీర్ల ద్వారా ఇంటి ముంగిటకే పథకాలు అందిస్తున్నారు. నాకు వైఎస్సార్‌ సీపీ హయాంలో చేయూత, సున్నా వడ్డీ, డ్వాక్రా రుణం, నా భర్తకు ప్రతి నెలా ఫించన్‌ అందుతున్నాయి. మళ్లీ జగనన్నే సీఎం కావాలి.

– లంకే వెంకటలక్ష్మి, ఎస్‌.కొత్తపల్లి, ఉప్పలగుప్తం మండలం

పోలీసు సేవలకు సలామ్‌



నడవలేని స్థితిలో కుర్చీలోనే ఉన్న రోగిని మోసుకెళుతున్న పోలీసులు



ఓ రోగికి ఊతంగా నిలిచి సీఎం దగ్గరకు తీసుకెళుతున్న పోలీసులు

అమలాపురం టౌన్‌: ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి అమలాపురం పర్యటనకు వచ్చిన సందర్భంగా హెలీపాడ్‌ వద్దకు దాదాపు 150 మంది రోగులు జగనన్న సాయాన్ని అభ్యర్థిస్తూ తరలివచ్చారు. నడవలేని స్థితిలో కుర్చీలోనే ఉన్న రోగులను పోలీసులు మోసుకుంటూ సీఎం జగన్‌ వద్దకు తీసుకుని వెళ్లారు. అలాగే ఒకరిద్దరి ఊతం ఉంటేనే గాని అడుగు తీసి అడుగు వేయలేని రోగులకు పోలీసులే ఊతంగా నిలిచి స్వయంగా నడిపించుకుని తీసుకెళ్లారు. సీఎం జగన్‌ పర్యటన సందర్భంగా అమలాపురంలో పోలీసుల సేవల దృశ్యాలను చూసిన వారంతా పోలీసు సేవలకు సలాం అంటూ అభినందించారు.

మంత్రి రాజాకు ప్రముఖుల పరామర్శ



మంత్రి రాజా తల్లి సత్యనారాయణమ్మకు నివాళులర్పిస్తున్న మంత్రి పినిపే విశ్వరూప్‌



మంత్రి రాజాను పరామర్శిస్తున్న అమలాపురం ఎంపీ చింతా అనురాధ

తుని: మాతృవియోగంతో బాధపడుతున్న రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజాను పలువురు ప్రముఖులు పరామర్శించారు. శనివారం తుని మండలం ఎస్‌.అన్నవరంలోని క్యాంపు కార్యాలయంలో రాజా తల్లి సత్యనారాయణమ్మ చిత్రపటానికి రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పినిపే విశ్వరూప్‌, అమలాపురం ఎంపీ చింతా అనురాధ, రాష్ట్ర వ్యవసాయ మిషన్‌ సభ్యుడు జిన్నూరి బాబీ, వైఎస్సార్‌ సీపీ సీనియర్‌ నాయకుడు తుని నియోజకవర్గం ఎన్నికల అబ్జర్వర్‌ చెల్లుబోయిన శ్రీనివాసరావులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మంత్రి రాజా, సత్యనారాయణమ్మ భర్త దాడిశెట్టి శంకర్రావులను పరామర్శించారు. పాయకరావుపేట, తుని నియోజకవర్గాలకు చెందిన పలువురు నాయకులు, ప్రజా ప్రతినిధులు పరామర్శించారు. ఏఎంసీ చైర్మన్‌ మాకినీడి బాబు తదితరులు పాల్గొన్నారు.

డీజీపీని కలిసిన ఎమ్మెల్యే అశోక్‌

యానాం: నూతనంగా నియమితులైన పుదుచ్చేరి డైరెక్టర్‌ జనరల్‌ ఆఫ్‌ పోలీస్‌(డీజీపీ) బి.శ్రీనివాస్‌ను శనివారం ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్‌ అశోక్‌ ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా డీజీపీ శ్రీనివాస్‌ను దుశ్శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. అనంతరం ఇరువురు యానాం నియోజకవర్గ శాంతిభద్రతలు తదితర అంశాలపై చర్చించారు.



డీజీపీ శ్రీనివాస్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యే అశోక్‌

వ్యాధిగ్రస్తుడికి ఆర్థిక సాయం

సఖినేటిపల్లి: మండలంలోని అంతర్వేదిపాలెం శివారు అడ్డాలపాలెంకు చెందిన సుగర్‌ వ్యాధిగ్రస్తుడు కొల్లాబత్తుల ధర్మరాజుకు, రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు రూ.10 వేల ఆర్థిక సాయం శనివారం అందజేశారు. సుగర్‌ వ్యాధి కారణంగా వెన్నుపూసలో సమస్యతో పాటు, ఇతర సమస్యలతో ధర్మరాజు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో వైద్యఖర్చులకై, కుటుంబ పోషణకై మానవతా దృక్పథంతో కువైట్‌ కేంద్రంగా ఉన్న ఆదర్శ ఆంధ్రాయూత్‌-కువైట్‌ (సామాజిక సేవా సంఘం)పై మొత్తాన్ని సమకూర్చింది. దీనిని ఎమ్మెల్యే రోగికి అందజేశారు. సర్పంచ్‌ గొల్లమందల చిట్టిబాబు, ఎంపీటీసీ నల్లి రత్నకుమార్‌, నాయకులు కుసుమ చంద్రశేఖర్‌రావు, నల్లి సుధీర్‌, రాపాక సూరయ్య, కుసుమ చింటూ, తాడి సహదేవ్‌, కె.అశోక్‌ పాల్గొన్నారు.



రోగికి సాయం పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు

ఆర్టీసీ బస్సును ఢీకొట్టిన బైక్‌

సఖినేటిపల్లి: సఖినేటిపల్లిరేవులో పంటుపైకి త్వరితగతిన వెళ్లాలన్న ఆతృతతో బైక్‌పై ఉన్న ముగ్గురిలో ఇద్దరు తీవ్రంగా గాయపడి అపస్మారక స్థితికి కారణమైంది. ఈ ప్రమాదంలో మరొకరు సురక్షితంగా బయట పడడం గమనార్హం. శనివారం జరిగిన పై ప్రమాదంపై స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం, సఖినేటిపల్లిరేవు వద్ద ఆర్టీసీ బస్‌ టర్నింగ్‌ తీసుకుంటున్న సమయంలో, రేవులో పంటుపైకి చేరేందుకు కోళ్ల లగేజీతో మోరికి చెందిన టి.వెంకటేశ్వరరావు, పి.భైరవస్వామి, ఎ.వెంకటేష్‌లు ఆతృతతో వెళ్లే క్రమంలో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. బైక్‌తో సరాసరి బస్‌ ముందు భాగాన్ని వారు ఢీకొట్టారు. ఊహించని ఈ ఘటనతో వారు బైక్‌తో సహా బస్‌ ముందు భాగంలో టైరు వద్దకు వెళ్లిపోయారు. ప్రమాదంలో ఎ.వెంకటేష్‌ సురక్షితంగా బయట పడ్డాడు. మిగిలిన ఇద్దరు వెంకటేశ్వరరావు, భైరవస్వామి తీవ్ర గాయాలపాలయ్యారు. గాయపడి అపస్మారక స్థితిలోకి వెళ్లిన బాధితులను ఇద్దరినీ ఆర్టీసీ బస్‌ డ్రైవర్‌, స్థానికులు హుటాహుటిన రాజోలు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.



సఖినేటిపల్లి రేవులో ప్రమాదంలో తీవ్రంగా గాయపడి అపస్మారక స్థితిలో ఉన్న వెంకటేశ్వరరావు, భైరవస్వామి

రూ.13 వేలు పలికిన గోదావరి పులస

యానాం: యానాం గౌతమీగోదావరిలో మత్స్యకారుల వలకు చిక్కిన పులస చేప రూ.13 వేల ధర పలికింది. శనివారం స్థానిక మత్స్యకారులు ఆ పులసను పుష్కరఘాట్‌ వద్ద వేలం పాటలో పెట్టగా రావులపాలేనికి చెందిన సత్యనారాయణరెడ్డి దక్కించుకున్నారు. గత నెలలో పులస తర్వాత యానాంలో రెండోసారి పులస పడినట్లయ్యింది. గత నెలలో చిక్కిన పులసను సైతం అధిక ధరకు పాడుకున్న విషయం తెలిసిందే.



రూ.13 వేలకు దక్కించుకున్న పులస చేపతో సత్యనారాయణరెడ్డి(ఎడమవైపు వ్యక్తి)

మూడున్నర కిలోల కణితి తొలగింపు

అమలాపురం రూరల్‌: మహిళ అండాశయం నుంచి మూడున్నర కిలోల కణితిని అమలాపురం కిమ్స్‌ వైద్యులు శస్త్రచికిత్స చేసి తొలగించారు. ఆసుపత్రి వైద్యులు తెలిపిన వివరాల ప్రకారం అయినవిల్లికి చెందిన 60 ఏళ్ల మహిళ కడుపునొప్పితో అమలాపురం కిమ్స్‌ ఆసుపత్రిలో చేరారు. ఆసుపత్రి వైద్యులు స్కానింగ్‌ చేసి ఆమెకు అండాశయంలో 27 సెంటీమీటర్ల వ్యాసమున్న కణితి ఉన్నట్లుగా గుర్తించారు. గైనకాలజిస్టులు వరద, మానస, అంకాలజీ సర్జన్‌ డాక్టర్‌ విశ్వనాథ్‌, మత్తు వైద్యురాలు సౌమ్యలతో కూడిన వైద్య బృందం ఆ మహిళకు శస్త్రచికిత్స చేసి సుమారు మూడున్నర కిలోల కణితిని అండాశయం నుంచి తొలగించారు. మూడు రోజుల పాటు తమ పర్యవేక్షణలో ఉంచి అనంతరం ఆమెను ఇంటికి పంపిస్తామని గైనకాలజిస్ట్‌ వరద శనివారం తెలిపారు. క్లిష్టమైన శస్త్రచికిత్స చేసిన వైద్య బృందాన్ని కిమ్స్‌ చైర్మన్‌ కేవీవీ సత్యనారాయణ రాజు, ఎండీ రవి కిరణ్‌ వర్మ, కిమ్స్‌ డీన్‌ డాక్టర్‌ ఆనంద్‌ ఆచార్యలు అభినందించారు.



మహిళ కడుపు నుంచి తొలగించిన మూడున్నర కిలోల కణితిని చూపుతున్న కిమ్స్‌ వైద్యులు

విశ్రాంత తహసీల్దార్‌ ఇంట్లో చోరీ

అమలాపురం టౌన్‌: స్థానిక హౌసింగ్‌ బోర్డు కాలనీలో నివసిస్తున్న విశ్రాంత తహసీల్దార్‌ పాము సుబ్బారావు ఇంట్లో చోరీ జరిగింది. రూ.1.50 లక్షల విలువైన 40 గ్రాముల బంగారు నగలు, వెండి పట్టీలు చోరీకి గురయ్యాయి. పట్టణ ఎస్సై జి.హరీష్‌ కుమార్‌ కథనం ప్రకారం.. సుబ్బారావు దంపతులు గత నెల 31న ఇంటికి తాళం వేసి బెంగళూరులోని కుమార్తె ఇంటికి వెళ్లారు. రోజూ ఇల్లు చూసుకుంటూ, ఇంట్లో దీపాలు వెలిగించాలని అదే కాలనీకి చెందిన భీమవరపు నాగేశ్వరరావుకు చెప్పారు. శనివారం ఉదయం సుబ్బారావుకు నాగేశ్వరరావు ఫోన్‌ చేసి ఇంటి తలుపులు తెరచి ఉన్నాయని, చోరీ జరిగినట్టు అనుమానంగా ఉందని చెప్పాడు. దీంతో అప్పటికే విజయవాడలోని మరో కుమార్తె ఇంట్లో ఉన్న సుబ్బారావు హుటాహుటిన అమలాపురం చేరుకుని, చోరీ జరిగినట్టు గుర్తించారు. ఆయన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై హరీష్‌కుమార్‌ తెలిపారు.

డ్రాఫ్ట్‌ మెరిట్‌ జాబితా విడుదల

యానాం: మెడికల్‌ కోర్సులైన ఎంబీబీఎస్‌, డెంటల్‌ తదితర కోర్సుల్లో యూజీ నీట్‌ పరీక్షలో అర్హత సాధించిన డ్రాఫ్ట్‌ మెరిట్‌ జాబితాను శనివారం సెంటాక్‌ విడుదల చేసింది. ఏటా ఎంబీబీఎస్‌ సీట్ల సాధనలో నాలుగు రీజియన్‌ల్లోనూ యానాం రీజియన్‌ విద్యార్థులే ముందుండేవారు. అయితే ఈ ఏడాది పుదుచ్చేరి రీజియన్‌ విద్యార్థులు అగ్ర స్థానంలోకి నిలవడం విశేషంగా చెబుతున్నారు. పుదుచ్చేరి వ్యాప్తంగా నాలుగు రీజియన్‌ల్లోనూ కలిసి 5,714 మంది విద్యార్థులు నీట్‌ పరీక్షకు హాజరుకాగా అందులో 3,140 మంది విద్యార్థులు అర్హత సాధించారు. జయసూర్య 695 మార్కులు, పరతం గొగాయ్‌ 682 మార్కులు, హర్షిణి 677 మార్కులతో మొదటి మూడు స్థానాల్లో నిలిచారు.

యూనియన్‌ మాజీ నేత మృతికి మంత్రి సంతాపం

అమలాపురం టౌన్‌: అమలాపురం ఆర్టీసీ ఎన్‌ఎంయూ మాజీ నేత, విశ్రాంత ఉద్యోగి యల్లమిల్లి రమేష్‌ మృతికి రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్‌, ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు సంతాపం తెలిపారు. స్థానిక సూర్యనగర్‌లోని దివంగత రమేష్‌ ఇంటికి మంత్రి విశ్వరూప్‌, ఎమ్మెల్సీ సూర్యనాయణరావు శనివారం వేర్వేరుగా వెళ్లి ఆ బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. మంత్రి, ఎమ్మెల్సీతో పాటు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యుడు పందిరి శ్రీహరి రామగోపాల్‌, కౌన్సిలర్‌ దొమ్మేటి రాము, పార్టీ నాయకులు వాసర్ల సుబ్బారావు, యనమదల కరుణాకర్‌ తదితరులు సంతాపం తెలిపారు.



రమేష్‌ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి విశ్వరూప్‌

గ్రామాల్లో మెరుగైన వైద్య సేవలు

కాట్రేనికోన: గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవలను మెరుగుపరిచేందుకు విలేజ్‌ క్లినిక్‌లు, ఫ్యామిలీ డాక్టర్‌ విధానం సమర్థవంతంగా అమలుచేస్తున్నట్లు పల్లంకుర్రు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్‌ ఎస్‌.గౌతమి శనివారం తెలిపారు. మండల పరిధిలోని బొజ్జవారిపేటలో నిర్వహించిన 104 వైద్య శిబిరంలో ఆమె రోగులను పరీక్షించి మందులు అందజేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది దేవికా, రామ్మోహన్‌, వంశీ, విజయలక్ష్మి, గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ గ్రంథాలయ దినోత్సవం

అమలాపురం రూరల్‌: భట్లపాలెం బీవీసీ ఇంజినీరింగ్‌ కళాశాలలోని సెంట్రల్‌ లైబ్రరీలో శనివారం గ్రంథాలయ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ పితామహుడు ఎస్‌ఆర్‌ రంగనాథన్‌ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో చీఫ్‌ లైబ్రేరియన్‌ నార్ని నారాయణ, ప్రిన్సిపాల్‌ జేవీజీరామారావు, ఏఓ జక్కం వెంకట కృష్ణారావు, వైస్‌ ప్రిన్సిపాల్‌ మదన్‌, ఫణికుమార్‌, రవిసుధీర్‌ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌ సీపీలో చేరిన బెండమూర్లంక సర్పంచ్‌



సర్పంచ్‌ సీతారత్నం మెడలో కండువా వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి

అల్లవరం: స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించిన బెండమూర్లంక సర్పంచ్‌ బర్రే సీతారత్నం శుక్రవారం అమలాపురం విచ్చేసిన ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌ సీపీలో చేరారు. ఆమెను రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్‌ పరిచయం చేశారు. సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి ఆమె మెడలో కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. మహిళల అభివృద్ధికి ముఖ్యమంత్రి ప్రవేశపెట్టిన అనేక సంక్షేమ పథకాలకు ఆకర్షితురాలినై వైఎస్సార్‌ సీపీలో చేరానని సర్పంచ్‌ శనివారం 'సాక్షి'కి తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ శేషగిరిరావు, జెడ్పీటీసీ సభ్యురాలు కొనుకు గౌతమి, సర్పంచ్‌ రాకాపు విజయలక్ష్మి, ఎంపీటీసీ రాజేశ్వరి పాల్గొన్నారు.

విద్యుత్‌ బకాయిలు చెల్లించాలి

కాట్రేనికోన: మండలంలోని విద్యుత్‌ వినియోగదారులందరూ పెండింగ్‌లో ఉన్న విద్యుత్‌ బిల్లులతో పాటు అడిషనల్‌ లోడ్‌ బిల్లులన్నీ వెంటనే చెల్లించాలని ఏఈ బి.నాగేశ్వరరావు శనివారం పేర్కొన్నారు. విద్యుత్‌ బకాయిలు చెల్లించని సర్వీసులను సోమవారం నుంచి నిలిపివేస్తామన్నారు. అమలాపురం డివిజన్‌లో సోమవారం నుంచి దీనిపై స్పెషల్‌ డ్రైవ్‌ చేస్తామన్నారు. విద్యుత్‌ వినియోగదారులు తక్షణమే బకాయి బిల్లులు చెల్లించి సహకరించాలని కోరారు.

పంట కాలువలో పడి యువకుడి మృతి

అమలాపురం రూరల్‌: పంట కాలువలో పడి యువకుడు మృతి చెందిన ఘటన మండలంలోని కామనగరువులో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నల్లమిల్లి గ్రామానికి చెందిన జంగా రామ్‌కుమార్‌(27) గురువారం ఉదయం అమలాపురంలోని తూర్ల కంపెనీలో పనికి వెళుతున్నానని చెప్పి ఇంటి నుంచి వెళ్లాడు. రాత్రయినా ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు చుట్టుపక్కల గ్రామాల్లో గాలించినా కనిపించలేదు. శనివారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో కామనగరువు పెట్రోల్‌ బంక్‌ ఎదురుగా అమలాపురం-చల్లపల్లి పంట కాలువలో రామ్‌కుమార్‌ శవం కనిపించింది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని శవాన్ని వెలికి తీయించారు. శవ పంచనామా అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతుడి తండ్రి ఏసు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తాలుకా ఎస్‌ఐ అందే పరదేశి తెలిపారు.

మత్స్యకారుల అభ్యున్నతికి కృషి



సమావేశంలో మాట్లాడుతున్న కొల్లు రవీంద్ర

సాక్షి, అమలాపురం: మత్స్యకారుల అభ్యున్నతికి టీడీపీ కృషి చేస్తోందని మాజీ మంత్రి, టీడీపీ రాష్ట్ర బీసీ సెల్‌ అధ్యక్షుడు కొల్లు రవీంద్ర అన్నారు. కోనసీమ జిల్లా మత్స్యకార సాధికార సమావేశం అమలాపురం అసెంబ్లీ టీడీపీ కార్యాలయంలో శనివారం నిర్వహించారు. జిల్లా అగ్నికుల క్షత్రియ సాధికార సమితి కన్వీనర్‌ లంకె భీమరాజు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రవీంద్ర మాట్లాడుతూ టీడీపీ ఆవిర్భావ పునాదులు బీసీలపైనే జరిగిందన్నారు. మాజీ ఎమ్మెల్యేలు అయితాబత్తుల ఆనందరావు, వనమాడి కొండబాబు, మాజీ జెడ్పీ చైర్మన్‌ నామన రాంబాబు, మెట్ల రమణబాబు తదితరులు పాల్గొన్నారు.